మామిడి మార్కెట్ ఏర్పాటయ్యేనా?

- దళారులను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు
- సీజన్ ప్రారంభమైనా అధికారుల నిర్లక్ష్యం
- ఆందోళనలో మామిడి రైతులు, కౌలుదారులు

వీపనగండ్ల: పండ్ల తోటలను సాగుచేసే రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మామిడి తోటల పెంపకంలో సబ్సిడీ ఎరువులు, కాయల నాణ్యత కోసం అవసరమయ్యే చర్యలు, విక్రయ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడంతో కుదేలవుతున్న రైతులను ఆదుకునే ఆపన్నహస్తం కోసం మామిడి రైతులు, కౌలుదారులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక కావడంతో..

కేంద్ర ప్రభుత్వం పంటల సమూహ అభివృద్ధి పథకం కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగు చేస్తున్న మామిడి తోటలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి రూ.172 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించడంతో రైతులు సంతోషించారు. ఈ పథకం ద్వారా తోటల విస్తరణ పెంపు, పాత తోటల పునరుద్ధరణ, సమగ్ర సస్యరక్షణ చర్యలు, ప్లాస్టిక్ బుట్టల పంపిణీ, తోటల యజమానులకు యంత్ర సామగ్రిని సమకూర్చడం, అధిక దిగుబడుల కోసం శిక్షణ, క్షేత్రస్థాయి సంఘర్షన వంటి కార్యక్రమాలను చేపడుతామని ప్రకటించినా.. ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. పథకం ప్రారంభమై మూడేళ్లు గడిచిన ఆర్థిక వెసులుబాటుకు సంబంధించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు.


మామిడి కాయల నాణ్యత కోసం అమర్చిన కవర్లు


కాయలను మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

మండలవ్యాప్తంగా..

మండలంలోని 14 గ్రామాల్లో 2,064 మంది రైతులు 4,801 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. మామిడికాయలను హైదరాబాద్‌కు తీసుకెళ్లి ప్రతి యేటా దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రవాణా ఖర్చులతో పాటు తరుగు పేరుతో వచ్చిన డబ్బుల్లో 20 శాతం దాకా కోత విధిస్తున్నారని వాపోతున్నారు. మామిడి పంట విక్రయాల కోసం కొల్లాపూర్ పట్టణంలో మార్కెట్ వసతులు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు అందుకు అవసరమైన చర్యలను తీసుకోలేదు.

సబ్సిడీలు అందిస్తున్నాం



పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక కావడంతో మామిడి రైతులకు క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 50 శాతం సబ్సిడీతో ఫ్రూట్ కవర్లు అందజేస్తున్నాం. రాబోయే రోజుల్లో కాయల రవాణా కోసం అవసరమైన బాక్సులతో పాటు రవాణా వసతుల మెరుగు కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం.

– కృష్ణ, మండల ఉద్యానవన శాఖ అధికారి, వీపనగండ్ల

మద్దతు ధర ప్రకటిస్తేనే..

మామిడి తోటల పెంపకంలో పెట్టుబడులు రోజురోజుకూ పెరిగి ఎకరాకు రూ.60 వేల దాకా ఖర్చవుతుంది. క్రిమిసంహారక మందులు, తెగుళ్ల నివారణ, తేనేమంచు పురుగు వల్ల దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదు. వరి పంటకు ప్రకటించిన విధంగానే మామిడికి కూడా మద్దతు ధర ప్రకటించాలి. ఈ వేసవి సీజన్‌లో మామిడి తోటలకు కోతుల బెడద ఎక్కువ అవ్వడంతో చేతికి వచ్చిన మామిడి కాయలు నేలపాలవుతున్నాయి. సబ్సిడీ ద్వారా కంచెను ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలి.

పెట్టుబడి కూడా రావడం లేదు



ప్రతి యేటా పెట్టుబడి రెట్టింపు అవుతుంది. పూత దశలో ఆశలు రేకెత్తిస్తున్న మామిడి తోటలు పిందె, కాయ దశకు వచ్చే వరకు పూర్తిగా నిరాశకు గురి చేస్తున్నాయి. ప్రతి యేటా నష్టాల వల్ల ఆర్థిక ఊబిలో కూరుకుపోతున్నాం. ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకోవాలి.

– తెలుగు నక్క భగవంత్, మామిడి రైతు, వీపనగండ్ల

మంత్రి జూపల్లి చొరవ చూపాలి



కొల్లాపూర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో వేలాది ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టి సారించాలి. దళారుల బారిన పడకుండా రవాణా ఖర్చులు తగ్గాలంటే కొనుగోలు కేంద్రం ఏర్పాటు తప్పనిసరి.

– బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి, వీపనగండ్ల

క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి చేయూత



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రుడు శ్రీనివాసులు కుటుంబానికి చిన్ననాటి మిత్రులు రూ.70 వేల పోగుచేసి నగదును శనివారం అందజేశారు. మిత్రుడి భార్య ఆపరేషన్ నిమిత్తం మిత్రులు అందరూ కలిసి తమకు తోచినంత నగదు ఇస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. మిత్రులు అందరూ కలిసి ఆర్థిక తోడ్పాటునందించడంపై శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రమేష్, శ్యామ్‌గౌడు, కుర్మన్న, అనిత, సంధ్య, సుధ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



వీపనగండ్ల: గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం పలు శాఖల ఉద్యోగులతో గ్రామసభ నిర్వహించారు. ఈ వేసవిలో గ్రామంలోని ప్రజలకు పని కల్పించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో ఉందని, జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవడం, అభివృద్ధి పనుల్లో పాలు పంచుకోవడం అనే అంశాలపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణ బాయి, ఎల్లమ్మ, మహేశ్వరి, సువర్ణ, కమల, ఆశాలు, మహిళలు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



అమరచింత: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ నిధులతో పట్టణంలోని ఏడో వార్డులో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య తెలిపారు. బీసీ కాలనీలోని ఏడో వార్డులో బొడ్రాయి సమీపంలో నూతనంగా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని కాలనీవాసుల వినతి మేరకు ఎంపీ డీకే అరుణ నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. పట్టణంలో మూడు ప్రదేశాల్లో ఒకొక్కటి రూ.2 లక్షల చొప్పున వెచ్చించి ప్రజా అవసరాల మేరకు హైమాస్ట్ లైట్లు బిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంగ అంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

కొత్తకోట రూరల్: ఓ వృద్ధుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతంలో ఓ మృతదేహం ఉన్నట్లు సమీప పొలాల వారు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసర ప్రాంతాలను పరిశీలించగా మృతదేహం సమీపంలో మృతుడి షర్ట్‌లో ఉన్న కాగితంపై ఉన్న ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా మృతుడు గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామానికి చెందిన కుర్మయ్య(60) అని తెలిసింది. కుర్మయ్య కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడని, గత నెల 24న జిల్లా ఆస్పత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో నడుచుకుంటూ వచ్చి మృతి చెందాడని తన తండ్రి మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి కుమారుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలి

పెబ్బేరు: మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సర్వేనంబర్ 22, 27లో గుడిసెలు వేసుకుని 40 రోజుల పాటు ఆందోళన చేపట్టి ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టామన్నారు. కాని అధికారులు ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పండుగ

ఖిల్లాఘనపురం: మండలంలోని వెంకటాంపల్లిలో శనివారం బొడ్రాయి పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి మూడో వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలోని ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. గోపూజ, గణపతి పూజతో ఉదయం పూజలు ప్రారంభించారు. సీతారామ, భవానీ, శంకర, నవగ్రహ, నాగదేవతలు, చంద్రాయుడు తదితర దేవతలకు వేద పండితులు అభిషేకం నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో చండీ హోమం, కలశ స్థాపన, ఆరాధన, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం గ్రామ దేవతలు బొడ్రాయి, కోట మైసమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామంలోని మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని కుంకుమ, పసుపు, పువ్వులు, వేపాకులు తదితర వాటితో అందంగా తయారు చేసిన బోనాలను తీసుకుని పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. బొడ్రాయికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవరశెట్టి అరుణ సురేందర్, మాజీ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

అన్ని రంగాల్లో మహిళల ముందంజ


తెల్లరాళ్లపల్లితండాలో ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

సాక్షి, నెట్‌వర్క్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండల కేంద్రాల్లో మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీలు, మహిళా సంఘాల సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళా సాధికారతకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలికలపై వేధింపులు నిర్మూలించేందుకు పటిష్ట చట్టాలు తేవాలని కోరారు.

- కొత్తకోట పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, సావిత్రి, వనజ, కుమారి, వెంకటేశ్వరమ్మ, రాధ, మంజుల, పుష్ప, సంతోష, భాగ్య, సువర్ణ, సునిత, కాంచన, అర్చన, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మను జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, పట్టణ కార్యదర్శి రమేష్, కోకన్వీనర్లు జయమ్మ, భూమిక, కల్పన, శ్రీదేవి, చెన్నమ్మ, అంజనమ్మ, వెంకటమ్మ, జయశ్రీ, సుమిత్ర, లావణ్య, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ చికినే శశిధర్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.
- అమరచింత మండలంలోని ఈర్లదిన్నెలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుక్క లక్ష్మమ్మ, ఆశిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.
- పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో గ్రామ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు చిట్టెమ్మ, మాజీ సర్పంచ్ శాంతమ్మ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంగన్‌వాడీలు, ఉపాధ్యాయిని శాలువాతో సన్మానించారు.
- వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో మెప్మా ఆర్పీలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్వో అనిల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మెప్మా సిబ్బంది, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- కొత్తకోట పట్టణ సమీపంలో గల ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా సిబ్బంది అపర్ణ, లక్ష్మిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డెన్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో ఆర్పీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు


ఆత్మకూర్‌లో..


జిల్లాకేంద్రంలో..

ప్రమాదవశాత్తు టిప్పర్ బోల్తా

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు ఓ టిప్పర్ బోల్తాపడిన ఘటన ఖిల్లాఘనపురం గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆమన్‌గల్‌కు చెందిన శివప్రసాద్ శనివారం సాయంత్రం తన టిప్పర్‌లో మండలంలోని కర్నెతండాలో ఉన్న గుట్ట నుంచి పలుగురాళ్లు నింపుకుని ఆమన్‌గల్‌కు తీసుకెళ్తున్నాడు. ఖిల్లాఘనపురం శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో టిప్పర్‌ను బీటీ రోడ్డు కిందికి దించాడు. ఈ క్రమంలో అదుపుతప్పి ఎదురుగా ఉన్న టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టాడు. అప్పటికీ వాహనాన్ని అదుపు చేయకపోవడంతో కొంతదూరం వెళ్లి ఓ కల్వర్టుకు ఢీకొట్టడంతో టిప్పర్ బోల్తాపడింది. ఈ సమయంలో డ్రైవర్ శివప్రసాద్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. టీవీఎస్ పూర్తిగా పాడైపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేయడంతో పాటు టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


అదుపుతప్పి బోల్తా పడిన టిప్పర్

కోటిలింగేశ్వరుడికి ఆరుద్రపూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏకరుద్రాభిషేక పూజలు నిర్వహించారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో గల శివలింగానికి భక్తులు పాలాభిషేకం చేయడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అల్వాల గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ గుడిసె దగ్ధమైన ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గొల్ల నక్క అంజనమ్మ బతుకుదెరువు కోసం గ్రామంలో మేకలను పెంచుతూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. శనివారం పెబ్బేరు సంతకు వెళ్లి మరి కొన్ని మేకలు తెచ్చుకుందామని గ్రామంలోని ఓ వ్యక్తితో రూ.లక్ష అప్పు తెచ్చుకుంది. మధ్యాహ్నం వరకు మేకలను మేపుకొని వచ్చి పెబ్బేరు సంతకు వెళ్దామని ఇంటికి రాగా అప్పటికే గుడిసెలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత ఇంట్లోకి వెళ్లి చూడగా మేకలను తీసుకొచ్చేందుకు అప్పుగా తీసుకొచ్చిన రూ.లక్ష మంటల్లో కాలిపోవడంతో పాటు ఇంటి సామగ్రి, బియ్యం, దుస్తులు కాలిపోనట్లు బాధితురాలు వాపోయింది. గ్రామానికి చెందిన కొందరు తక్షణసాయంగా బియ్యం, కొంత నగదు ఆర్థికసాయాన్ని బాధితురాలికి అందజేశారు.

రేషన్ బియ్యం తరలింపు నిందితుడి గుర్తింపు

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి గుర్తించిన 85 బస్తాల రేషన్ బియ్యం సోళీపురం గ్రామానికి చెందిన సాయికుమార్‌రెడ్డికి చెందినవి గా గుర్తించినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలానికి వచ్చిన సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్ ఈ విషయమై పంచనామా నిర్వహించి పశువుల పాక వద్ద నిల్వ చేసిన బియ్యాన్ని వనపర్తి స్టాక్ పాయింట్‌కు తరలించారన్నారు. రేషన్ బియ్యం కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమని ఈ విషయమై సాయికుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చెప్పారు. డీటీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈతవనం.. అడుగడుగునా నిర్లక్ష్యం

- రక్షణ లేక వాడుతున్న మొక్కలు


ఈత వనంలో నీరు లేక వాడుముఖం పడుతున్న మొక్కలు

అమరచింత: గ్రామాల్లో ఈత వనాలను పెంచి ప్రజలకు స్వచ్ఛమైన కల్లును అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ఈత వనాల విస్తరణపై చర్యలు తీసుకుంది. కానీ వాటిని అమలు పర్చడంలో అధికారులు అలసత్వం చూపడంతో ఈత వనాల లక్ష్యం నీరుగారుతోంది. అమరచింత మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో సర్వే నంబర్ 55బై ఉ1, 2, 3 లలో 8 ఎకరాల వ్యవసాయ పొలంలో అమరచింత కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. వీటిలో ఈత మొక్కలను పెంచడంతో తమకు ఉపాధి లభిస్తుందని గీత కార్మికులు 4 వేల మొక్కలు నాటారు. అప్పటి ప్రభుత్వం హరిత హారం కార్యక్రమంలో వీటి సంరక్షణను ఈజీఎస్‌కు అప్పగించింది. మొక్కలకు డ్రిప్ ద్వారా నీటిని అందించాలంటే వాటిలో బోరు వేయడం, రక్షణ కంచె కోసం నిధులు ఇవ్వాలని గీత కార్మికులు అప్పటి ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో సొసైటీ ద్వారానే రూ.1.75 లక్షలు ఖర్చుచేసి వాటికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నా.. సరైన సమయంలో నీరు అందకపోవడంతో ఎండుముఖం పడుతున్నాయి. ప్రస్తుతం 4 వందల ఈత మొక్కలు మిగిలాయని, వీటి సంరక్షణ కోసమైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు.

అన్నదాతల ఆశలు సజీవం


ఆర్డీఎస్ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

- ఇండెంట్‌తో ఆయకట్టు రైతుల్లో హర్షం
- పంటలకు అందిన చివరి తడులు
- మరో వారంపాటు సాగునీటికి అవకాశం

రాజోళి: ఆర్డీఎస్ కెనాల్‌కు ఇండెంట్ ద్వారా నీరు విడుదల కావడంతో అన్నదాతల ఆశలు సజీవంగా ఉన్నాయి. గత వారం వరకు ఆర్డీఎస్ ఆయకట్టుపై రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు నీరు అందక రైతన్నలు విలవిలలాడారు. పంటలు ఎండుముఖం పడుతుండటంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు కెనాల్‌కు నీరు విడుదల చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లబోదిబోమన్న రైతులు..

గత వారంలో ఎగువ నుంచి నీరు రాకపోవడంతో కెనాల్‌లో నీరులేక పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రస్తుతం జొన్న, మొక్కజొన్న పంటలు ఆయకట్టు కింద సాగులో ఉన్నాయి. చివరి తడులు పెట్టాల్సిన తరుణంలో కెనాల్‌లో నీరు లేకపోవడంతో రైతులు లబోదిబోమన్నారు. ఆరుకాలం పండించిన పంట చేతికందే దశలో నాశనమైపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కెనాల్ పరిధిలో కొన్ని పంట ఎండుముఖం పట్టిందని పేర్కొన్నారు. పలుచోట్ల పక్కన పొలాల్లో ఉన్న బోర్ల నుంచి తడులు అందించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎగువ నుంచి సాగునీరు రావడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీరు లేక ఎండుముఖం పట్టిన జొన్న, మొక్కజొన్న పంటలకు ఊపిరి అందినట్లు అయిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరో వారంపాటు..

ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరు అందాలంటే ఎగువ నుంచి వచ్చే ఒక్క ఇండెంట్ సరిపోకపోవడంతో ఏపీ–తెలంగాణ ఉమ్మడి ఇండెంట్‌ను మంగళవారం కలిసి పెట్టడంతో ఎగువ నుంచి నీరు విడుదల చేశారు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మరో వారం పాటు ఆర్డీఎస్ కెనాల్‌లో నీటి ప్రవాహం ఉంటుందని రైతులు ఇబ్బందులు లేకుండా నీటి తడులు అందించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. రైతులు కూడా ఇవే చివరి తడులుగా భావించి నీటిని అందించే పనిలో పడ్డారు.

ఆశలు వదిలేసుకున్నాం..

గత వారం దాకా నీరు విడుదల కాకపోవడంతో మొక్కజొన్న పంటపై ఆశలు వదిలేసుకున్నాం. మూడు రోజుల కిందట నీరు వదలడంతో పంటకు తడులు అందిస్తున్నాం. ప్రస్తుతం వదిలిన నీటితో పంట చివరి దాకా సరిపడే తడులు అందించవచ్చు.

–జనార్దన్, రైతు, గోకులపాడు

మొక్కజొన్నకు తడులు ఇస్తున్నాం..

చివరి ఇండెంట్‌గా కెనాల్‌లో ప్రవహిస్తున్న నీటితో పంటలకు ప్రాణం పోసినట్లైంది. పశువుల గడ్డి, మొక్కజొన్న, జొన్న పంటలు కీలక దశలో ఉన్నాయి. మొక్కజొన్న, గడ్డికి తడులు అందిస్తున్నాం. నీరు విడుదల కాకుంటే తీవ్రంగా నష్టపోయేవాళ్లం.

– నర్సింహ గౌడ్, వెంకట్రామన్‌నగర్

నీరు అందిస్తాం..

కెనాల్‌లో మరో మూడు రోజుల పాటు నీరు ప్రవహిస్తుంది. ఒక వేళ నదిలో నీరు తగ్గితే ఎగువ నుంచి వస్తున్న ఇండెంట్‌తో మళ్లీ కెనాల్‌కు నీరు అందించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నీటితో రైతులు తడులు అందిస్తున్నారు.

– వరుణ్, ఆర్డీఎస్ ఏఈఈ